www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 30 సెప్టెంబర్ 2025

కబడ్డీ జట్టుకు శ్రీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక

శివకుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు: శ్రీసాయి డిగ్రీ కళాశాలలో 3వ సంవత్సరం బి.కాం చదువుతున్న బోయ శివకుమార్ అనే విద్యార్థి సౌత్ జోన్ కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన వైవీయూలో జరిగిన సౌత్‌జోన్ కబడ్డీ సెలక్షన్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి సౌత్ జోన్ కబడ్డీ జట్టుకు ఎంపికయ్యాడని ఆయన తెలిపారు. ప్రిన్సిపల్ పెంచలయ్య, డైరెక్టర్ పి.శ్రీనివాసులు, కళాశాల అధ్యాపకులు ఎంపికైన విద్యార్థిని అభినందించారు. ఎంపికైన విద్యార్థి కర్ణాటకలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ కబడ్డీ పోటీల్లో కళాశాల తరుపున ప్రాతినిధ్యం వహించనున్నాడని, ఈ విజయంతో కళాశాల పేరు గర్వంగా నిలిచిందని, భవిష్యత్తులో కూడా ఇలాగే క్రీడా రంగంలో రాణించాలని ప్రిన్సిపల్, అధ్యాపక బృందం ఆకాంక్షించారు.

అమ్మో..ఇసుకాసురులు

- యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు
- అక్రమార్కులకు అధికారుల అండదండలు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఆందోళనలో రైతులు

సమ్మర్ స్టోరేజీలో జెసిబితో లోడుతున్న ఇసుక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుకను ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. నిర్దేశిత క్వారీలలోనే అనుమతులు మేరకు రవాణా ఖర్చులు చెల్లించి ఇసుకను ఆయా ప్రాంతాల పరిధిలో నిర్మాణాలకు తరలించుకోవచ్చని నిబంధనలు పెట్టింది. ఇదేఅదునుగా భావించిన ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. వీరికి పుష్కలంగా అధికారుల మద్దతు పరోక్షంగా ఉండడంతో మూడుపువ్వులు ఆరుకాయలుగా ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రీచ్‌లలో కాకుండా వంకలు, వాగులు, చెరువులు, వ్యవసాయ పొలాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తూ అక్రమార్జనకు బాటలు వేసుకుంటున్నారు. ఏదిఏమైనప్పటికీ మదనపల్లెలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ సెలవు రోజుల్లో అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. చెరువులు, వంకల్లో ఇసుకను తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. మదనపల్లెతో పాటు నిమ్మనపల్లె, రామసముద్రం, కురబలకోట మండలాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీ పరిధిలోని రెడ్డిచెరువు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పరిధిలో ఇసుకను యంత్రాలతో తోడేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.3,500 నుంచి రూ.4 వేలకు విక్రయిస్తున్నారు. బసినికొండ పంచాయతీ పరిధిలోని నిమ్మనపల్లె రోడ్డు పెద్దచెరువుల్లో, కొత్తవారిపల్లె పంచాయతీ పరిధిలోని తెట్టువంకలో, పొన్నూటిపాళ్యం పంచాయతీ పరిధిలోని ఎర్రగాలివంకల్లో జెసిబి యంత్రాలతో ఇసుక తోడేశారు. కొందరు చెరువు సమీపంలోనే పట్టా భూముల్లో ఇసుకను అక్రమంగా నిల్వచేసి విక్రయాలు సాగిస్తున్నారు. సిటిఎం పెద్దచెరువు, నిమ్మనపల్లె మండలంలోని బహుదా కాలువ నుంచి పట్టపగలే ఇసుక రవాణా అవుతోంది. బహుదా నది పరివాహక ప్రాంతాలైన ముత్తారు, అగ్రహారం, బండమీదపల్లె ప్రాంతాల్లో ఇదే తరహాలో ఇసుక తోడేస్తున్నారు. ఇదే కొనసాగితే చెరువులకు వచ్చే వాననీరు నిల్వలేకుండా పోతుంది. సాగు, తాగు అవసరాలకు నీరు లభించే పరిస్థితి ఉండదు. చెరువుల్లో ఇసుక ఉంటేనే నీరు నిలబడి తాగునీటి పథకాలకు, వ్యవసాయానికి అవసరమైన సాగునీటి కష్టాలు తీరుతాయని రైతులు, గ్రామస్తులు వాపోతున్నారు. ప్రభుత్వ సెలవులు వస్తే చాలు ఈ వ్యాపారం జోరందుకుంటోంది. రాత్రి వేళల్లో జేసీబీలతో తోడేసి ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. రెండో శనివారం, ఆదివారం సమయాల్లో అధికారులు అందుబాటులో ఉండక పోవడంతో అక్రమార్కులు చెరువులను గుల్ల చేస్తున్నారు. వేంపల్లె పంచాయితీ-వివా కాలువ సమీపంలోని మామిడితోటలో ఇసుక నిల్వలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

రెవెన్యూ అధికారుల అండదండలు

ఇసుకాసురులకు రెవెన్యూ అధికారుల మద్దతు పుష్కలంగా లభిస్తోంది. ఇసుకతోడే సమయాల్లోను, ఇతర ప్రాంతాలకు తరలించే క్రమంలోను అధికారులకు సమాచారం ఇచ్చినా సకాలంలో స్పందించరనే విమర్శలు ఉన్నాయి. పైగా నిర్మాణాలు చేపట్టేందుకు ఇసుకను నిల్వ చేసుకున్నారని అధికారులే వత్తాసు పలుకుతున్నారు.

అడుగంటుతున్న భూగర్భజలాలు

ఎక్కడ పడితే అక్కడ ఇసుకను తోడేయడం వల్ల భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. సిటిఎం పెద్దచెరువు కింద మూడున్నర ఎకరాల భూమి ఉంది. నీళ్ల లేక రెండెకరాల్లోనే సాగు చేస్తున్నా.

- రవీంద్ర, రైతు, సిటిఎం, మదనపల్లె.

సమ్మర్ స్టోరేజీను కొల్లగొడుతున్నారు

మదనపల్లె ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం సమ్మర్ స్టోరేజ్ ఏర్పాటు చేసింది. ఇసుక వ్యాపారులకు సమ్మర్ స్టోరేజ్ ఆదాయ వనరుగా మారింది. సమ్మర్ స్టోరేజ్ రూపు రేఖలే మారిపోయాయి. వర్షం నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదు. చెరువుకింద భూములన్నీ బీడులుగా మారుతున్నాయి.

- విశ్వనాథరెడ్డి, రైతు, చిప్పిలి, మదనపల్లె.

ఇసుక ఉంటే నీరు ఇంకుతుంది

చెరువులు, వంకలు, వాగుల్లో ఇసుక ఉంటేనే పడే వర్షపునీరు నిల్వ ఉంటుంది. ఏడాది పొడవునా పంటలకు చెమ్మ తగిలి ఉంటుంది. ఎండిపోకుండా ఉంటాయి. బోర్లలో పుష్కలంగా ఉంటాయి. ఇసుకను తోడేస్తే నీరు ఇంకే పరిస్థితి ఉండదు. పుష్కలంగా వర్షం పడినా భూమిపై తేమ త్వరగా ఆరిపోతుంది. పంటలు ఎండిపోతాయి.

- భాస్కర్, రైతు, దిగువబోయపల్లి, కురబలకోట.

తాము ఏమీ చేయలేం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన రీచ్‌లలో బిల్లులు కట్టి ఇసుక తెచ్చుకున్నారు. నిర్మాణాలు కట్టేంత నిల్వ చేసుకున్నారు. ఇసుక నిల్వ చేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. సొంతానికి తోలుకున్నట్లు బిల్లులు చూపుతున్నారు తామేమీ చేయలేం. ఇదొక్కటే కాదు మాకు చాలా పనులున్నాయి.

- కిషోర్ కుమార్‌రెడ్డి, తహశీల్దారు, మదనపల్లె.

7న ధర్నాను విజయవంతం చేయండి : ఫ్యాప్టో

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా అక్టోబర్ 7న విజయవాడ ధర్నా చౌక్ వద్ద వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా కో చైర్మన్ రవిశంకర్, సెక్రటరీ జనరల్ గఫార్‌ఖాన్ జిల్లాలోని ఉపాధ్యాయులకు పిలుపు నిచ్చారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు విజయవాడలో చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశం జిల్లా ఇన్‌ఛార్జి రవిశంకర్ అధ్యక్షతన సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుండి తప్పించడం, అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పిఆర్‌సి, మధ్యంతర భృతి మంజూరు, సిపిఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శిం చారు. ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెబుతూనే రాష్ట్రంలోని 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించిన పరిస్థితి కానీ, చర్చించిన పరిస్థితి కానీ లేదన్నారు. ప్రభుత్వ పథకాలను, నిర్ణయాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఉద్యో గులకు సంబంధించిన సమస్యల పరిష్కారం, సంక్షేమం మాత్రం ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించవలసిన దాదాపు రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటిం చాలని కోరినప్పటికీ ఇంత వరకు స్పందన లేదన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఇంతవరకు చర్చించిన పరిస్థితి లేదన్నారు. 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుకు సంబంధించిన దస్త్రం ఆర్థిక శాఖలో గత నాలుగు సంవత్సరాలుగా మూలుగు తుందన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించవలసిన గ్రాట్యూటీ, కమ్యూటేషన్, ఇఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, అంత్యక్రియల ఖర్చులు తదితర పెన్షన్ సౌలభ్యాలను కూడా చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతున్నదని విమర్శించారు. పురపాలక ఉపాధ్యాయులకు జిపిఎఫ్ సౌకర్యం, అర్బన్ ఎంఇఒ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వెంటనే ఎంటిఎస్‌ను అమలు చేయాలని కోరారు. కారుణ్య నియామకాలలో జాప్యం వలన మరణించిన ఉద్యోగుల వారసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతర్ జిల్లా బదిలీలలో స్పౌజ్ క్యాటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న వారందరికీ బదిలీ అవకాశం కల్పించాలని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్, జేఎల్ పదోన్నతుల సమస్యపై ప్రభుత్వం చిత్తశుద్ధి కనపరచక పోవడంతో మూడు దశాబ్దాలుగా కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యా రంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా నాయకులు రామ కృష్ణ, శివారెడ్డి, ఇలియాస్, సిబాతుర్రహ్మాన్, హరిబాబు, రవీంద్రరెడ్డి, జఫరుద్దీన్, రెడ్డెయ్య, ఎన్.రవీంద్రరెడ్డి, అంజాద్‌బాషా పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

మాట్లాడుతున్న యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి.రమణ

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

మున్సిపల్ కార్మికులకు రెండు నెలల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని ఎపి మున్సి పల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా అధ్యక్షులు బి.వి. రమణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు తప్పిదాల కారణంగా గత రెండు నెలలుగా ఆప్కాస్ వర్కర్లకి వేతనాలు రావడం లేదన్నారు. అధికారులు చేసిన తప్పులకు కార్మికులను బలి చేయడం తగదని పేర్కొన్నారు. నెలల తరబడి జీతాలు అందక పోవడంతో కార్మికుల తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. చనిపో యిన లేదా రిటైర్డ్ అయిన వర్కర్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులను ఆప్కాస్‌లో చేర్చాలన్నారు. కాంట్రాక్ట్ పరిధిలో పని చేస్తున్న వర్కర్లకు పెండింగ్ ఉన్న నాలుగు నెలల జీతాన్ని వెంటనే చెల్లించాలన్నారు. మస్టర్ల దొంగలపై విచారించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రతపై దృష్టి సారించాలని కోరారు. కార్మికులకు 12వ పిఆర్‌సి ప్రకారం రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, సమ్మె కాలపు హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఏ. రామాంజులు, ఉపాధ్యక్షులు చెన్నయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్‌బాబు

ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

- మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్‌బాబు

ప్రజాశక్తి - నందలూరు

ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి.అశోక్ బాబు అన్నారు. సోమవారం నందలూరుకు చేరుకున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు దళిత నాయకులు స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో అశోక్ బాబును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలలు అన్ని విధాలుగా నష్టపోతారన్నారు. కొందరి మాయమాటల మోజులో పడి కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ చేయడం అన్యాయం అన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని పరిరక్షించేందు కోసమే ఈ యాత్ర చేపట్టామన్నారు. మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం సంజీవ్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నందలూరు సర్పంచ్ మోడపోతుల రాము, ఆర్ముగం విశ్వనాథ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు పెనుబాల నాగ సుబ్బయ్య, కాకి చంద్ర, నాయన పల్లి ఆదినారాయణ, తుమ్మది శివకుమార్, గుడిష సుబ్రహ్మణ్యం, ఎముక దుర్గయ్య, శివ, నరసింహులు, సురేష్, నాగభూషణం, నాగరాజు, డిస్కో మని పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్లో ప్రవేశానికి గడువు పెంపు : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులలో 2025-26 సంవత్సరానికిగాను ప్రవేశాలకు అక్టోబర్ 31 వరకు రూ.200 అపరాధ రుసుంతో అవకాశం కల్పించామని డిఇఒ కె. సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాల వయస్సు నిండిన వారు పదవ తరగతిలో ప్రవేశం పొందవచ్చుని, అలాగే 10 వ తరగతి పూర్తి చేసిన వారు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందవచ్చునన్నారు. ఓపెన్ స్కూల్ ద్వారా ప్రవేశం పొందినవారు సెలవు దినాలలో నిర్వహించే తరగతులకు హాజరు కావాలన్నారు.పై తరగతులలో అడ్మిషన్ పొందిన వెంటనే దరఖాస్తులో మీరు పెట్టిన అడ్రస్‌కు నేరుగా బుక్స్ ఇంటికి పంపుతారని చెప్పారు. రెగ్యులర్ కోర్సు ద్వారా వచ్చే సర్టిఫికెట్స్‌కు ఎంత విలువ ఉంటుందో ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్స్ కూడా అంతే విలువ ఉంటుందని పేర్కొన్నారు. వీటి ద్వారా పొందిన సర్టిఫికెట్లతో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాలు కూడా పొందవచ్చునని అన్నమయ్య జిల్లా ఓపెన్ స్కూల్ జిల్లా కో - ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు తెలియజేశారు.

రెండో విడతలో అందరికీ రేషన్‌కార్డులు

ప్రజాశక్తి-గాలివీడు

రేషన్ కార్డులు రాని వారికి రెండో విడతలో అందరికీ వస్తాయని తహశీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో 38 రేషన్ షాపులున్నాయని, వాటిలో 15 వేల 619 రేషన్ కార్డులు ఉండగా డీలర్ల ద్వారా 15291 రేషన్ కార్డులు పంపిణీ చేశామని చెప్పారు. ఇంకా 328 రేషన్ కార్డులు బ్యాలెన్స్‌లో ఉన్నాయని రెండో విడతలలో మంజూరు అవుతాయని పేర్కొన్నారు. కొత్తగా రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న వారికి కూడా రేషన్ కార్డులు మంజూరు అవుతాయని చెప్పారు. ఈ విషయంలో ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికీ కార్డులు ఇస్తామని పేర్కొన్నారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి

పిజిఆర్‌ఎస్ అర్జీలకు సకాలంలో, నాణ్యతతో పరిష్కారం చూపాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పిజిఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజా సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కార పై నేరుగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్-ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

రోడ్డుపైనే వేరుశనగ ఆరబోత

- కల్లాలు లేక రోడ్డుపై ఆరబోస్తున్నామంటున్న రైతులు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

రోడ్లపై ఆరబెట్టిన వేరుశనగ కాయలు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని వెలిగల్లు ముంపు గ్రామంలో రైతులు వేరుశనగ కాయలను ఎక్కువమంది పండించారు. వెలిగల్లు బ్యాక్ వాటర్ కింద సాగు చేస్తున్నారు. వేరుశనగ చెట్లకు ఉన్న కాయలను ఒలిపించుకొని వాటిని ఆరబెట్టుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. వర్షం కురవడంతో ఇళ్లల్లోనే రాసులుగా పోసుకున్నారు. వీలున్నప్పుడల్లా తారు రోడ్డుపైన, వీధుల్లోని రోడ్లపై ఆరబెట్టుకుంటున్నారు. గ్రామంలో వంద మందికి పైగా రైతులు వేరుశనగను పండించారు. రైతులు పండించిన పంట చేసుకోవడానికి కల్లాలు లేక రోడ్లపై వేసుకునే పరిస్థితి ఏర్పడింది. వేరుశనగ కాయలు ప్రస్తుతం 43. 5 కిలోల ధర రూ.2800 నుంచి రూ.3000 పలుకుతుంది. కదిరి, హిందూపురం, రాయచోటి నుంచి వ్యాపారులు వచ్చి లేపాక్షి కాయలను 43.5 కిలోలు ధర రూ. 1800కు రైతుల నుంచి నేరుగా తుకాలు వేసుకుని కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు మార్కెట్‌లో అధిక రేటుకు విక్రయించు కుంటున్నారు. తమకు ఏమీ గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు.

రూ.లక్ష కోట్లు ప్రజలకు వెనక్కి ఇవ్వాలి : వైసిపి

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్

ప్రజల నుంచి విద్యుత్ బిల్లుల పేరుతో అదనంగా వసూలు చేసిన రూ.లక్ష కోట్లను వెంటనే కూటమి ప్రభుత్వం ప్రజలకు తిరిగి చెల్లించాలని వైసిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయభాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము అధికా రంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ బిల్లులను తగ్గిస్తామని చెప్పి వచ్చిన తర్వాత ఆ పనిచేయకపోగా ప్రజలపై రూ.19 వేల కోట్ల విద్యుత్ భారాన్ని మోపడం దారుణమన్నారు. ఈ విషయాన్ని విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ వ్యతిరేకించి వసూలు చేసిన రూ.923.5 కోట్లను తిరిగి ప్రజలకు చెల్లించాలని నిర్ణయించడం కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టన్నారు. కూటమి ప్రభుత్వం అసలు విషయాన్ని దాచుతూ విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తున్నట్లు ఎల్లో మీడియా ద్వారా ప్రచారం చేసుకోవడం దారుణమని వాపోయారు. విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ చెప్పిన ప్రకారం రూ.923.55 కోట్లు కాకుండా, 2024-25 కాలానికి అక్రమంగా వసూలు చేసిన ట్రూ అప్‌ఛార్జిలు రూ.20,758 కోట్లను తిరిగి విద్యుత్ వినియోగదారులకు వాపసు చేయాలంటూ డిమాండ్ చేశారు. చంద్రబాబు పారిశ్రామిక ప్రగతిపై అబద్దాలు చెబుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. అసెంబ్లీలో కుల రాజకీయాలు చేస్తూ ప్రజా సంపదను తన పార్టీ కార్యకర్తలు, నాయకులకు దోచిపెడుతుండడం దారుణం అన్నారు. ప్రభుత్వ భూములను తమకు అను కూలమైన కొందరికి నామమాత్రపు రేటుతో దారా దత్తం చేస్తున్నారంటూ ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు విసిగిపోతున్న ప్రజలు రాబోయే ఎన్నికల్లో కూటమి పార్టీలను తరిమికొట్టడం ఖాయం అన్నారు. సమావేశంలో రాష్ట్ర టియుటి యూనియన్ ప్రధాన కార్య దర్శి సంజీవయ్య, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సాంబశివ, జిల్లా అధ్యక్షుడు చంద్రనాయక్, పీలేరు బిసి సెల్ అధ్యక్షుడు భాస్కర్, వైసిపి నేతలు నారాయణ, ప్రసాద్, గంగరాజు, రాజానాయక్ పాల్గొన్నారు

వెంకటేశ్వరరావుకు మెమోంటో ఇస్తున్న కళాశాల యాజమాన్యం

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి-మదనపల్లె: పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్‌లో సోమవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలికిరి జెఎన్‌టియుఎ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వం రావు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు, ఆవిష్కరణాత్మక ఆలోచనలు, ప్రాక్టికల్ జ్ఞానం అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి విద్యార్థులు సర్టిఫికేషన్ కోర్సులు చేయడం ద్వారా గ్లోబల్ లెవెల్‌లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు కళాశాల ప్రత్యే కతలు, శిక్షణ విధానాలు, ప్రాక్టికల్ లెర్నింగ్ ప్రాముఖ్యతను వివరించి, అకడమిక్ టాపర్స్ సాధనను గుర్తుచేసి కొత్త విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. కళాశాల చైర్మన్ అండ్ కరస్పాండెంట్ ఆర్. రామ్మోహన్ రెడ్డి, అధ్యక్షులు ఎం. నాగమల్లారెడ్డి తల్లిదండ్రులు, విద్యార్థుల సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని, అందుబాటులో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

పార్టీ శ్రేణులకు డిజిటల్ బుక్ భరోసా

ప్రజాశక్తి-సుండుపల్లి: మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో మండల కన్వీనర్ ఎంర్రామస్వామిరెడ్డి చేతులమీదుగా అన్యాయానికి గురవుతున్న వైసిపి కార్యకర్తల కోసం రూపొందించిన 'డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్' పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ఆపదలో ఉన్న కార్యకర్తలను ఆదుకోవడం కోసమే క్యూఆర్ కోడ్‌ను రూపొందించామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్‌పిటిఇ ఇస్మాయిల్, స్టేట్ బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి పటాన్ రెహమాన్ ఖాన్, స్టేట్ ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి నాగేంద్ర నాయక్ చౌహాన్, పిఎన్ కాలువ ఉప సర్పంచ్ రఫీ, సుండుపల్లి మండల సోషల్ మీడియా కన్వీనర్ సయ్యద్ సల్మాన్, వడ్లపల్లి మధుసూదన్‌రెడ్డి, ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షులు చంద్రనాయక్, శేఖర్‌రెడ్డి, చిన్న గొల్లపల్లి సర్పంచ్ రామా జయచంద్ర, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **వీరబల్లి :** మండలంలోని మాజీ ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి స్వగృహంలో డిజిటల్ బుక్, క్యూ ఆర్ కోడ్ సోమవారం పంచాయతీరాజ్ రాష్ట్ర ప్రధాన విభాగ కార్యదర్శి గాలివీటి వీరనాగిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి మాట్లాడుతూ కార్యకర్తలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తమ సమస్యలను తెలియపరచాలని కోరారు. అధికార పార్టీ అధికా రులు, నాయకుల వల్ల అన్యాయం జరిగితే ఫొటో, వీడియో రూపంలో ఈ డిజిటల్ బుక్‌లో తెలియపరచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా సోషల్ మీడియా ప్రెసిడెంట్ నరేష్ స్వామి, వైసిపి నాయకులు ఆరంరెడ్డి, వీర నాగిరెడ్డి మల్లు , ఓదివీడు సర్పంచ్ శివరామ్, మాజీ సర్పంచ్ రమణ, మెంబర్ మల్లేష్ గౌడ్, వీరబల్లి సోషల్ మీడియా ప్రెసిడెంట్ శివరామకృష్ణ గౌడ్, సోషల్ మీడియా రెడ్డెయ్య నాయుడు పాల్గొన్నారు.

సుండుపల్లె : డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న రాందేవ్ మహిళా మండలి సభ్యులు

వృద్ధులు, పిల్లలకు అన్నదానం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

దసరా మహోత్సవాలను పురస్కరించుకొని రాందేవ్ మహిళా మండలి సభ్యులు సోమవారం స్థానిక చైతన్య స్వచ్ఛంద సంస్థలో పిల్లలకు, వృద్ధులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ జనరల్ సెక్రటరీ కవితారాణి మాట్లాడుతూ రాందేవ్ మహిళా మండలి సభ్యులు ఎంతో ఉన్నత ఆశయంతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. సంస్థకు విచ్చేసి ఇక్కడున్న వృద్ధులకు, పిల్లలకు రెండు పూటలా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించామన్నారు. పలు సందర్భాలలో సంస్థకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం రాందేవ్ మహిళా మండలి సభ్యుల సేవా నిరతికి నిదర్శనం అన్నారు. అనంతరం వారికి జ్ఞాపికను బహూకరించి, కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజలకు ఆహ్లాదం టైటానిక్ షిప్ ఎగ్జిబిషన్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

టైటానిక్ షిప్ ఎగ్జిబిషన్ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతుందని ఎమ్మెల్యే షాజహాన్ బాష అన్నారు. మదనపల్లెలో ఏర్పాటు చేసిన టైటానిక్ షిప్ ఎగ్జిబిషన్‌ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన టైటానిక్ షిప్ ఎగ్జిబిషన్ ప్రాంగణంలో తిరిగి ప్రత్యేకలు తెలుసుకున్నారు. ఎగ్జిబిషన్‌లో ఉన్న గేమ్స్‌లో పాల్గొని ఆస్వాదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద ఎగ్జిబిషన్లలో ఒకటిగా గుర్తింపు పొందిన టైటానిక్ ఎగ్జిబిషన్ మదనపల్లె పట్టణ ప్రజలకు అందుబాటులోకి రావడం, ఇంటిల్లిపాది సందర్శించడానికి అనువుగా ఉంటుందన్నారు. యాంత్రిక జీవితంతో ఎంతో బిజీగా ఉన్న సమయంలో కుటుంబంతో కలిసి సరదాగా గడపటం కూడ ఎంతో అవసరమని చెప్పారు. ఈ ఎగ్జిబిషన్‌లోకి అడుగుపెట్టగానే టైటానిక్ షిప్‌లో ప్రయాణం చేసిన గొప్ప అనుభూతి కలుగు తోందన్నారు. ఎగ్జిబిషన్ యజమాని సి.కె.దినేష్ కుమార్, కో-ఆర్డినేటర్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ జెయింట్ వీల్, బేబీ ట్రైన్, మ్యూజిక్ చైర్స్ వంటి వాటిలో పిల్లలు, పెద్దలు సరదాగా గడపవచ్చన్నారు. నోరూరించే తిను బండారాలు, గృహ అవసరాలకు ఉపయోగపడే వస్తువులు అందుబాటులో ఉండడం తమ ప్రత్యేకత అన్నారు. చిన్నారులను అబ్బుర పరిచే విధంగా ఘోస్ట్ హౌస్ ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలు కుటుంబ సమేతంగా టైటానిక్ షిప్ ఎగ్జిబిషన్ సందర్శించి ఆనందం, ఆహ్లాదకర పరిస్థితులను ఆస్వాదించాలని కోరారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రవీంద్రనాథ్, మేనేజర్ అబ్దుల్ అజీజ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే చింతలను సత్కరిస్తున్న వైసిపి శ్రేణులు

మాజీ ఎమ్మెల్యే 'చింతల'కు సన్మానం

ప్రజాశక్తి-పీలేరు: పీలేరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రరెడ్డిని వైసిపి రాష్ట్ర మైనారిటీ విభాగం సంయుక్త కార్యదర్శి షేక్. షాకీర్ బాషా సత్కరించారు. సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్యేను వాల్మీకిపురంలోని తన క్యాంపు కార్యాలయం వైసిపి శ్రేణులతో మర్యాదపూర్వకంగా కలిశారు. వైసిపి అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చింతల రామచంద్రారెడ్డిని వైసిపి రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమించినందుకు వైసిపి నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. తమ నాయకుడు ఇలాంటి ఉత్తమ పదవులు మరెన్నో పొందాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ విభాగం సంయుక్త కార్యదర్శి షాకీర్ బాష, పీలేరు మండల ఎస్.టి. సెల్ మండల అధ్యక్షులు కాలనీ చిన్న, ఐటి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉబేదుల్లా, పీలేరు మండల ప్రచార విభాగ అధ్యక్షులు ఇస్మాయిల్. తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - వీరబల్లి : మండలంలోని సానిపాయి పంచాయతీ దళితవాడలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో సోమవారం సీతారాముల వారి విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు. ప్రధాన అర్చకులు, ప్రజల ఆధ్వర్యంలో ముందుగా వినాయకుడి పూజ మొదలు, హోమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. ప్రజలకు అన్నదాన ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్ రాజు, మండల అధ్యక్షుడు భానుగోపాల్ రాజు హాజరయ్యారు. వారికి మహిళలు, ప్రజలు హారతులు పట్టి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. పి-4 పథకంలో పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దానన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలైన పింఛన్లు, మెగా డిఎస్‌సి, ఉచిత గ్యాస్ సిలిండర్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. పేద, మధ్యతరగతి వారికి జిఎస్‌టి తగ్గించిందన్నారు. వైసిపిప్రభుత్వంలో ప్రతి కుటుంబంపై ధరలు బాదుడే అన్నారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

సరస్వతిదేవి అలంకారంలో వాసవీమాత

ప్రజాశక్తి-వాల్మీకిపురం: మండలంలోని గండబోయనపల్లి కోటలో శ్రీ సత్యమ్మ తల్లి ఆలయంలో ఎనిమిదవ రోజు సోమవారం శ్రీ సత్యమ్మ తల్లి సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన, అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు, అలంకరణలు నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన సద్దల కళ్యాణి, చక్రపాణి దంపతులు అమ్మవారికి సారే, చీర సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పులి సత్యనారాయణ రెడ్డి, సద్దల చక్రపాణి, ప్రభాకర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, రమేష్, చంద్రశేఖర్, చిన్నప్పరెడ్డి, హరి, సర్పంచ్ గుర్రప్ప, పూజారి ఉత్తన్న, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు. **నందలూరు :** మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 7వ రోజు సరస్వతి దేవి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పురోహితులు బండాత్మకూర్ శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో పంచామ ృతాభిషేకం, చండీ పారాయణం,నిర్వహించారు. సాయంత్రం మహిళలు సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకట కుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహ ప్రసాద్, మంచి కంటి నారాయణ, వల్లంకొండు చంద్రశేఖర్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్, కుమార్ పాల్గొన్నారు. **రాయచోటి:** శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో దసరా నవ రాత్రుల్లో భాగంగా శ్రీ సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ భద్రకాళి అమ్మవారు. దర్శనార్థం వచ్చిన భక్తులకు అర్చనలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.వి.రమణారెడ్డి తెలిపారు. **తంబళ్లపల్లె :** మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమ రాంభికా సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామిని, ప్రత్యేక అలంకరణతో అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో పూజారి శేఖర్ పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపు లబ్ధిని ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

జిఎస్‌టి శాతం తగ్గింపు వల్ల వినియోగదారులకు కలిగే ప్రయోజనాలు గడప గడపకు తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ రవి, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ షేక్ సుమయ, డివైఎసి ఈశ్వరమ్మ, జిఎస్‌టిఒ హరిత, ఎఇఒ కరీం అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జిఎస్‌టి 2.0 మీద డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర సరుకులతో పాటు విద్య, వస్త్రాలు రవాణ తదితర విభాగాల్లో ఎంతో ప్రయోజ నం కలుగుతుందన్నారు. జిఎస్‌టి తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు, డ్వాక్రా మహిళలు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అక్టోబర్ 19 వరకు అన్ని శాఖల అధికారులు జిఎస్‌టి తగ్గింపుపై ప్రజలకు కలిగే ప్రయోజనాలపై పలు రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. **కలకడ:** జిఎస్‌టి సేవింగ్స్‌పై మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వ హించాలని ఎంపిడిఒ భానుప్రసాద్ సూచించారు. మండలంలోని 9 గ్రామ సచివాలయాల్లో గ్రామ సచివాలయ స్థాయిలో అవగాహనా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, మండల అధికారులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** జిఎస్‌టి సామాన్యులకు అందుబాటులో ఉందని ఎంపిడిఒ రమేష్ బాబు అన్నారు. జిఎస్‌టిపై ప్రజలకు దుకాణదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఎం మురళి, సంఘమిత్రలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాష్, ఎంపిడిఒ నాగిరెడ్డి, తహశీల్దారు అమర్నాథ్, ఎపిఎం వసుంధర, ఎపిఒ మృత్యుంజయరావు, నేతలు సూరపరాజు సుబ్బరాజు, రమణారెడ్డి, కృష్ణంరాజు, రామరాజు, గడికోట సుబ్బరాయుడు, వెంకట్రామరాజు, శివయ్య, ముంతాజ్ బేగం, అధికారులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ఎంపిడిఒ అబ్దుల్ షకూర్ ఆధ్వర్యంలో జిఎస్‌టిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ విశ్వనాథ్, ఎఇఒ గంగాధర్, ఎంఇఒ రెడ్డి శేఖర్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

మున్సిపల్ కౌన్సిల్‌ను రద్దు చేయండి

చైర్‌పర్సన్‌ను నిలదీస్తున్న కౌన్సిలర్ తులసి రామకృష్ణ

ప్రజాశక్తి-మదనపల్లె

అభివృద్ధికి సహకరించని కౌన్సిల్‌ను కలెక్టర్ రద్దు చేయాలని కౌన్సిలర్ తులసి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం స్థానిక కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ మనూజ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో టిడిపి కౌన్సిలర్ రామకృష్ణ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా ఈ కౌన్సిల్ ఏమి అభివృద్ధి చేసిందని ప్రశ్నించారు. అభివృద్ధికి సహకరించని ఈ కౌన్సిల్లో కలెక్టర్ జోక్యం చేసుకొని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసి కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించి బయటికి వెళ్లిపోయారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి మాట్లాడుతూ మున్సిపాలిటీలో 11,800 విద్యుత్ స్తంభాలు ఉన్నాయని వాటికి విద్యుత్ దీపాలు మార్చడానికి కేవలం నలుగురు ఎలక్ట్రిషన్ మాత్రమే ఉన్నారన్నారు. దానివలన అన్ని ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు లేక ఇబ్బంది పడుతు న్నారన్నారు. 30 మంది సిబ్బందిని మున్సిపాలిటీ నియమించే అవకాశం ఉందని గుర్తు చేశారు. స్థానిక కోమటివానిచెరువు వద్ద చేపడుతున్న సిమెంట్ రోడ్డు, కాలువ నిర్మాణం పనులకు అక్కడ కౌన్సిలర్ సమాచారం లేదన్నారు. కౌన్సిలర్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ మురికివాడ అభివృద్ధి చేయడం కోసం ఎస్సీ, ఎస్టీల సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదని ఆరోపించారు. మురుగు కాలవలు ఏర్పాటు చేయాలన్నారు. పార్టీలకతీతంగా గతంలోనూ ఇప్పుడు కూడా తన వార్డు వివక్షకు గురౌతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. 18వ వార్డులో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని వెంటనే పరిష్కారం చేయాలని వైస్ చైర్మన్ డిమాండ్ చేశారు. కౌన్సిలర్ రాజేష్ మాట్లాడుతూ తన వార్డులో పారిశుధ్యం అభివృద్ధి పనులు జరగలేదని పేర్కొన్నారు. జరిగిన పనులకు బిల్లులు కూడా రావడం లేదని ఆరోపించారు. కౌన్సిలర్ కరిముల్లా మాట్లాడుతూ 35వ వార్డు నుంచి సమానంగా రూ.21 కోట్లు వసూలు చేసిపుడు అన్ని వార్డులకు సమాంతరంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ కాజా మాట్లాడుతూ తన వార్డులో మురుగు నీటి కాలువలు చెత్త తీయడం లేదని పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందన్నారు. అభివృద్ధి పనులు వేగం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కౌన్సిల్ ఎజెండాను ఏకగ్రీవంగా వాయిదా వేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ తనూజ మాట్లాడుతూ ఈ ఎజెండాను పూర్తిగా పరిశీలించి తర్వాత సాధారణ సమావేశం నిర్వహించి అప్పుడు అజెండాపై చర్చిస్తామన్నారు. అంతవరకు తాత్కా లికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ ప్రమీల మేనేజర్ మనోహర్ డిఇలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన గురువులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డిఎస్‌సి నియామకంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొంది స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జిటిలుగా నియామక పత్రాలు పొందిన వారిని కలెక్టర్ నిశాంత్ కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో ఉపాధ్యాయులుగా నియామకం అవ్వడం వారు చేసిన కష్టానికి ఫలితం అని అంతేకాకుండా ఒక బాధ్యతని పేర్కొన్నారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని వారికి సూచించారు. జిల్లాకు, మీరు పనిచేయబోయే పాఠశాలకు మంచి పేరుతేవాలన్నారు. స్కూల్ అసిస్టెంట్‌గా నియామకమైన సజ్జద్ మహమ్మద్, ఎస్‌జిటిగా నియామకమైన శివాజీలకు మెగా డిఎస్‌సి నియామక పత్రాలు అందజేసి కలెక్టర్ అభినందించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొంది ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లుగా, ఆరుగురు ఎస్‌జిటిలుగా నియామకం అయ్యారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడికి నియామక పత్రం అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాజశేఖర్‌కు ఆచార్యదేవోభవ పురస్కారం

పురస్కారం అందుకుంటున్న ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి -చిట్వేలి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల బోధకుడిగా, ఎన్‌సిసి అధికారిగా పనిచేస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్న పసుపుల రాజశేఖర్‌ను ఆచార్యదేవోభవ జాతీయ పురస్కారం 2025 వరించింది. ఆదివారం బాపట్ల జిల్లాలోని వేటపాలెంలో ఈ అవార్డును యువతేజం ట్రస్ట్ కలాం విజన్ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ హైకోర్టు చీఫ్ సూపర్డెంట్ పివిపి అంజలి కుమారి, సంస్థ చైర్మన్ ఎస్.కరీముల్లా, డాక్టర్ నారాయణస్వామి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత రాజశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ బోధన, సామాజిక సేవా రంగాలకు చేస్తున్న కృషికి గాను ఈ అవార్డు దక్కిందని పేర్కొన్నారు. ఇది సేవా దృక్పథంలో మరింత బాధ్యతను పెంచిందని తెలియజేశారు. అవార్డు గ్రహీత రాజశేఖర్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-కలికిరి: మండలంలోని మాదిగపల్లిలో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ తహశీల్దార్ సయ్యద్, డిప్యూటీ ఎంపిడిఒ మొహమ్మద్ రియాజుద్దీన్ హాజరై గ్రామ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని వాటికి పరిష్కార మార్గాలను కనుగొనే విధంగా చూస్తామని తెలిపారు. సమావేశంలో గ్రామ ప్రజలు పలు సమస్యలను అధికారులు ముందుకు తీసుకువచ్చారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, రహదారుల మరమ్మతులు, పంటలకు నీటి సౌకర్యం, పెన్షన్ల మంజూరు, రేషన్ సరఫరాలో లోపాలు, విద్యుత్ సమస్యలు వంటి అనేక అంశాలను గ్రామస్తులు ప్రస్తావించారు. ప్రజల విన్నపాలను ఓర్పుతో విన్న అధికారులు వాటిని పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి సమస్యను విభాగం వారీగా పరిశీలించి పరిష్కార మార్గాలను చూపిస్తామని స్పష్టం చేశారు. వ్యవసాయాధికారి హేమలత మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉన్న పథకాల గురించి వివరణ ఇచ్చారు. పంటల బీమా, ఎరువులు, విత్తనాల పంపిణీ వంటి అంశాలపై రైతులు సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సూపరింటెండెంట్, వీఆర్‌ఒ గౌరీ వంటి అధికారులు ప్రజలు లేవనెత్తిన సమస్యలపై సమగ్రంగా సమాధానం ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాస్ వర్మ, యేసు రాజు మాట్లాడుతూ అణగారిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. స్థానిక ప్రజలు రాంబాబు సహా గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు.

బ్రాహ్మణులకు స్థానం కల్పించడం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె : దేవస్థానం పాలక మండలిలో బ్రాహ్మణులకు కూడా స్థానం కల్పించడం హర్షణీయమని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రసాద్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నార. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలకు ముందు దేవస్థానం పాలకమండలిలో బ్రాహ్మణులకు కూడా చోటు కల్పిస్తామని సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారని, ఆ మేరకు వేంపల్లెలోని వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలిలో వెలవలి మారుతి ప్రసన్నకు సభ్యులుగా నియమించారన్నారు. ఇటీవల రాష్ట్రంలోని అన్ని దేవస్థానం పాలకమండలిల్లో బ్రహ్మణ కేటగిరీని సభ్యులుగా నియమించడం శుభపరిణామమన్నారు.

10 నుంచి సౌత్ ఇండియా లెవెల్ క్యారమ్స్ పోటీలు

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్స్టిట్యూట్ నందు యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సౌత్ ఇండియా లెవెల్ క్యారమ్స్ పోటీలు అక్టోబర్ 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ పోటీలో పాల్గొనదలచినవారు అక్టోబర్ 5వ తేదీ లోపల ఎంట్రీలు పంపాలని తెలిపారు. క్యారమ్స్ పోటీలు(స్త్రైట్ గేమ్)లో ఉంటాయని తెలిపారు. ఎంట్రీలను బి.ఎన్.శంకర్ ప్రెసిడెంట్, యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్, నందలూరు అన్నమయ్య జిల్లా వారికి పంపాలని తెలిపారు. ఎంట్రీల కోసం సంప్రదించవలసిన ఈ క్రింది మొబైల్ నెంబర్ల సంప్రదించాలని కోరారు. బి.ఎన్ శంకర్ (7732054403), జి.నాగభూషణం (9908095211), ఎం.సుధాకర్ (9866015602), పి.నారాయణ (7989392971) ఈ పోటీలలో డబుల్స్ విన్నర్స్‌కు రూ.40 వేలు, డబుల్ రన్నర్స్‌కు రూ.25 వేలు సింగిల్స్ విన్నర్స్‌కు రూ.25 వేలు, సింగల్ రన్నర్స్‌కు రూ.15 వేలు, డబుల్స్ సెమీఫైనల్ లూసర్స్‌కు రూ.12 వేలు, సింగిల్స్ సెమీఫైనల్ లూసర్స్‌కు రూ.8 వేలు, డబుల్ క్వార్టర్ ఫైనల్ లూసర్స్‌కు రూ.12 వేలు, సింగిల్ క్వార్టర్ ఫైనల్ లూసర్స్‌కు రూ.ఆరు వేలు, బెస్ట్ ప్లేయర్ అవార్డుకు రూ.5000, క్యారమ్స్ పోటీలలో ఓపెన్ ఫినిషింగ్ చేస్తే రూ.వెయ్యి ఇస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులకు భోజన సౌకర్యం కమిటీ వారు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిర్వాహకులు

సెల్ పాయింట్ షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సెల్ పాయింట్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోనే రవి హాల్ దగ్గర చిత్తూరు మున్నా నూతనంగా ఏర్పాటు చేసిన జెన్యూన్ మొబైల్ షోరూమ్‌ను సోమవారం రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఇండస్ట్రియల్ ఏరియాను పరిశీలించిన మంత్రి..** సోమవారం సాయంత్రం పట్టణంలోనే చిత్తూరు రోడ్డులోని ఇండస్ట్రియల్ ఏరియాలో వారి ఆహ్వానం మేరకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పరిశీలించారు. అనంతరం కంపెనీ యజమానులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపిఐఐసి డైరెక్టర్ కొండా భాస్కర్ రెడ్డి,పలువురు మైనార్టీ టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

చంద్రప్రసాద్‌కు గుర్రం జాషువా అవార్డు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గోపగుడిపల్లి చెందిన అక్కల చంద్రప్రసాద్ యాదవ్ మహాకవి, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అవార్డు అందుకున్నారు. ఈనెల 28న విజయవాడలోని కౌతా పూర్ణానంద కళావేదికలో గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా పౌరాణిక జానపద రచయితగా సేవా రంగంలో విశిష్ట సేవా అందించిన అట్టల చంద్ర ప్రసాద్‌కు గుర్రం జాషువా అవార్డును పల్నాడు జిల్లా తెనాలికి చెందిన తెలుగు కళ రత్నాలు సాంస్కృతిక సాంస్కృతికసేవా సంస్థ గుర్రం జాషువా మనవడు డాక్టర్ సునీల్ కుమార్ అందజేశారు. గజమాలతో సన్మానం పొందడం సంతోషంగా ఉందని చంద్ర ప్రసాద్ పేర్కొన్నారు కడప నగరంలో ప్రథమ చికిత్సాలయం స్థాపించి వైద్యునిగా కొనసాగుతూ పౌరాణిక నాటకాలలో ప్రదర్శించేవారు. జానపద గేయాలు రచనలు చేస్తూ రచయితగా రాణిస్తున్నారు. గుర్రం జాషువా అవార్డు అందుకోవడం పట్ల మండలంలోని ఆయన బంధువులు, స్నేహితులు యాదవ కమ్యూనిటీ వారు అభినందనలు తెలియజేశారు.

క్రైం కార్నర్

ఆటో బోల్తా : యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ఆటో బోల్తా పడిన ఘటనలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన సోమవారం మదనపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లి, చౌడేశ్వరి వీధికి చెందిన నరసయ్య, రెడ్డమ్మ దంపతుల కుమారుడు కృష్ణ భగవాన్ (27) టైల్స్ పనిచేస్తూ జీవనం చేసేవాడు. స్నేహితుడితో కలిసి ఆటోలో బైపాస్ రోడ్‌లో వెళ్తుండగా, మార్గమధ్యంలోని సయ్యద్ కార్స్ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కృష్ణ భగవాన్ తీవ్రంగా గాయపడడంతో గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు గాయపడిన సంఘటన సోమవారం ములకలచెరువు మండలంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మదనపల్లె మండలం పోతుబోలుకు చెందిన నరసింహులు, మొలకలచెరువు మండలం చౌడ సముద్రంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ తన మామ రమణతో కలిసి నరసింహులు ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు బయలుదేరారు. మార్గమధ్యంలోని పాపిరెడ్డిగారి పల్లి సమీపంలోని చెట్లవారిపల్లె వద్ద ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడడంతో గమనించిన స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుల ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ములకలచెరువు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బైకు బోల్తా పడి వెటర్నరీ ఉద్యోగికి..

బైక్ బోల్తా కొట్టడంతో వెటర్నరీ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ములకలచెరువు మండలంలో చోటు చేసుకుంది. బాధి తుని కథనం మేరకు..ములకలచెరువుకు చెందిన నాగేంద్రప్రసాద్ కందూరులో వెటర్నరీ ఆసుపత్రిలో ఎల్ఎస్‌గా పనిచేస్తున్నారు.. విధుల్లో భాగంగా ద్విచక్ర వాహనంలో బురకాయల కోటకు వెళుతుండగా, మార్గమధ్యంలోని దూలంవారి పల్లి వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన బాధితున్ని స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తర లించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అందించి, పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. ములకలచెరువు పోలీసులు విచారణ చేస్తున్నారు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి -లక్కిరెడ్డిపల్లి: మండలంలోని కాకులారం పంచాయతీ చిలకపాటివాండ్లపల్లి దళితవాడలో విద్యుత్తు లైన్ మరమ్మతులు చేస్తుండగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన సంజయ్ (32) విద్యుత్తులైన బిగిస్తుండగా ప్రమాదవశాత్తు 11 కెవి లైన్లు తగిలి సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పూర్వ వర్ధమాన్ జిల్లా రామగోపాల్పూర్‌కు చెందిన సంజయ్ కొంతకా లంగా ఓ కాంట్రాక్టు వద్ద లైన్‌మెన్ సహాయకుడిగా పనిచేస్తున్నాడని తెలిపారు. విద్యుత్ లైన్లు బిగిస్తుండగా ప్రమాశాత్తు వైరు తగిలి మృత్యువాత పడ్డాడని తెలిపారు. గాయపడిని యువకుడిని ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు

- 92.030 గ్రాముల బంగారం స్వాధీనం

ప్రజాశక్తి - పుల్లంపేట : మండల పరిధిలోని వత్తలూరు వడ్డిపల్లికి చెందిన ఏరు కాలువ రమాదేవికి చెందిన 92.030 గ్రాముల బంగారు నగలను దొంగిలించి తీసుకొని పోవాలని ఉద్దేశంతో ఆమెను కొట్టి దాడి చేసి మారిపోయిన వేముల విశ్వనాథంను మొరవడ్డిపల్లి గ్రామం అరెస్టు చేసినట్లు రాజంపేట ఎఎస్‌పి మనోజ్‌కుమార్ హెగ్డే తెలిపారు. సోమవారం ఆయన పుల్లంపేట పోలీసు స్టేషనల్‌లో నిందితుడి అరెస్టు సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పీలేరు మండలానికి చెందిన విశ్వనాథంను ఎస్‌పి ఆదేశాల మేరకు రాజంపేట రూరల్ సిఐ బి.వి.రమణ, పుల్లంపేట ఎస్‌ఐ శివశంకర్ సోమవారం ఉదయం 9.45 నిమిషాలకు రెడ్డిపల్లి చెరువుకట్ట దగ్గర అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. అతని వద్ద నుంచి బైకును సీజ్ చేయడంతో పాటు రూ.9.50 లక్షలు విలువ చేసే బంగారు నగలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. నేరానికి ఉపయోగించిన రక్తపు మరకలు కలిగిన రాయిని, మొబైల్ ఫోన్‌ని సీజ్ చేశామని తెలిపారు. సదుం, పుల్లంపేట, పెనగలూరు పోలీసుస్టేషన్లలో అతనిపై దొంగతనం కేసు ఉన్నాయన్నారు. ఈ ఘటనపై అరెస్టయిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి మనోజ్‌కుమార్